క్లుప్తంగా

వీరభద్రుడి పట్టు వస్త్రాల వేలం

రాయచోటి టౌన్: రాయచోటి భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించిన వస్త్రాలను (చీరలు, పంచెలు) ఈనెల 18న వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వస్త్రాలతో పాటు భక్తులు వితరణ చేసిన బియ్యం, వట్టి కొబ్బరి కూడా వేలం వేస్తామని తెలిపారు. వేలం పాటలో హిందువులు మాత్రమే పాల్గొనాలని తెలిపారు.

వైభవంగా జాతర


ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి

సంబేపల్లె : మండల పరిధిలోని శనివారం పలు గ్రామాల్లో జాతరలు వైభవంగా నిర్వహించారు. నాగిరెడ్డిగారిపల్లె పంచాయతీ చౌడమ్మ తల్లి, శెట్టిపల్లె గ్రామం దిగువరాజువారి పల్లె హరిజనవాడ సమీపంలో మాతమ్మ తల్లి, శెటిపల్లె గ్రామం కొత్తపల్లె బిడికీలో నాగాపురమ్మ అమ్మవారి జాతరలను కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు.

లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు


పూజలందుకున్న లక్ష్మీనరసింహస్వామి

రాయచోటి జగదాంబసెంటర్: రాయచోటి పట్టణం లక్ష్మీపురంలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామి వారి మూలవిరాట్‌ను పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు.

ఆంజనేయుడికి పూజలు

రాయచోటి పట్టణం కొత్తపేటలోని గ్రూప్ థియేటర్స్ వద్ద వెలసిన శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామి వారికి ఆకుపూజలు, సిందూర పూజలు తదితర పూజాది క్రతువులను నిర్వహించారు.

నివాళి


చిన్నరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి, కుటుంబ సభ్యులు

రాజంపేట రూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి మేనమామ రేణింతల చిన్నరెడ్డి (ఓబుళం లక్ష్మికర రెడ్డి) ఇటీవల మృతి చెందారు. చిన్నరెడ్డి చిన కర్మ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు ఆకేపాటి అనిల్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మండల పరిధిలోని రేణింతల గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నరెడ్డి చిత్రపటం వద్ద ఆకేపాటి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాటు పలువురు పాల్గొన్నారు. చిన్నరెడ్డి సేవలను పలువురు కొనియాడారు.

ప్రణాళికతో సాగు.. దిగుబడులు బాగు

- జూన్ మొదటి వారం నుంచే ఖరీఫ్ సీజన్ ఆరంభం
- నేలను బట్టి పంట మార్పిడి చేయాలంటున్న వ్యవసాయాధికారులు


వంతాటిపల్లెలో జీలుగ పంటను సాగు చేసిన రైతులు


పొలాల్లో సేంద్రియ ఎరువును చల్లేందుకు సిద్ధం చేసుకున్న రైతులు

సిద్దవటం : ప్రణాళికతో పంట సాగు చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు సూచిస్తున్నారు. జూన్ మొదటి వారం నుంచే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ఈ ఏడాది మండల వ్యాప్తంగా 1,100 హెక్టార్‌లలో వరి పంట సాగు అయ్యే అవకాశం ఉంది. కాగా రైతులకు పచ్చిరొట్ట ఎరువుల కోసం సిద్దవటం మండలానికి ప్రభుత్వం నుంచి జనుములు 100 క్వింటాళ్ల మంజూరు కావడంతో వాటిని ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రాలలో రైతులకు పంపిణీ చేశారు. జనుము విత్తనాలను చల్లుకున్నారు. మరికొందరు రైతులు జీలుగ విత్తనాలను కొనుగోలు చేసి చల్లుకొని పంట సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. దీని ద్వారా ఒక ఎకరాకు 10 కిలోల మోతాది ద్వారా 8 నుంచి 10 టన్నుల పచ్చి రొట్ట ఎరువు లభిస్తుంది. ప్రభుత్వం ద్వారా రైతులకు అన్నదాత సుఖీభవ పథకం నిధుల కోసం రైతులు ఎదురు చూసి ఇంత వరకు రాక పోవడంతో కొందరు రైతులు పంటల సాగు కోసం అప్పులు తెచ్చుకుంటున్నారు.

భూసారాన్ని బట్టి పంట వేసుకోవాలి

ఖరీఫ్‌కు ముందే ప్రతి రైతు తమ భూమిలో భూసార పరీక్షలు చేయించుకుంటే బాగుంటుందని అధికారులు పేర్కొంటున్నారు. భూసారాన్ని బట్టి అనుకూలమైన పంటలు మాత్రమే వేసుకోవాలి. దీని వల్ల రైతులకు పెట్టుబడులు తగ్గి దిగుబడి పెరుగుతుంది. భూసారానికి అనుగుణంగా ఎరువులు, యాజమాన్య పద్ధతులు పాటించాలి.

సేంద్రియ ఎరువులు వినియోగించాలి



ప్రతి రైతు సేంద్రియ ఎరువులను వినియోగించడం అలవాటు చేసుకోవాలి. ఎక్కువగా రసాయన ఎరువులు వాడకం వల్ల పంటల దిగుబడిలో పలు సమస్యలు ఎదురవుతాయి. పశువుల ఎరువులు, వర్మీ కంపోస్టు ఎరువుల ద్వారా భూసారం పెరగడంతో పాటు నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చు.

–కె.రమేష్‌రెడ్డి, వ్యవసాయాధికారిణి, సిద్దవటం మండలం

యోగాతో ఆరోగ్యం పదిలం


యోగా చేస్తున్న బెటాలియన్ పోలీసులు

సిద్దవటం: ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యం మెరుగుపడుతుందని బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ వెంకటశివుడు తెలిపారు. సిద్దవటం మండలం భాకరాపేట గ్రామ సమీపంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో శనివారం కమాండెంట్ ఆనందరెడ్డి ఆదేశాల మేరకు ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెటాలియన్‌లో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా అసిస్టెంటు కమాండెంట్ వెంకటశివుడు మాట్లాడుతూ జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ముందు నెల రోజుల పాటు జరిగే యోగా వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అనంతరం ఇషా ఫౌండేషన్ సభ్యులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దళవాయిపల్లి పాఠశాలలో..

పుల్లంపేట: కలెక్టర్ ఆదేశానుసారం మండల పరిధిలోని దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించామని పాఠశాల ఉపాధ్యాయుడు రమణ తెలిపారు. విద్యార్థులకు యోగాపై ప్రత్యేక శిక్షణ ఇచ్చామని తెలిపారు.

భూ వివాదంలో ఘర్షణ

ఓబులవారిపల్లె: గాదెల పంచాయతీ, తల్లెంవారిపల్లి గ్రామంలో ఇరువర్గాల మధ్య భూ వివాదం నడుస్తోంది. ఈ విషయం కోర్టులో కూడా ఉంది. అయితే 19వ తేది గాదెలలో గంగమ్మ జాతర జరుగుతున్న నేపథ్యంలో పాత కక్షలు భగ్గుమన్నాయి. బీజేపీ మాజీ మండల అధ్యక్షులు చిన్నిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కొలవల అమర్నాథ్ రెడ్డి మధ్య భూ వివాదం నడుస్తోంది. శుక్రవారం సాయంత్రం పొలానికి వెళ్లే దారిలో అడ్డుగా రాజగోపాల్ రెడ్డి ముల్లకంచె వేశాడు. ఈ విషయంపై ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దాడిలో రాజగోపాల్ రెడ్డి తలకు గాయమైంది. గాయపడ్డ రాజగోపాల్ రెడ్డిని రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. విచారించి దాడికి గాయపడ్డ నలుగురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు సిఐ వెంకటేస్వర్లు తెలిపారు.

రాంనగర్‌లో ఘర్షణ

రాజంపేట: రాంనగర్‌లో శనివారం ఇరువర్గాలు ఘర్షణకు దిగారు. పరస్పర దాడులు చేసుకున్నారు. బాల కృష్ణ అనే వ్యక్తి కర్రతో దాడికి దిగడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. గాయపడినవారు స్థానిక ప్రాంతీయ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

ఆపరేషన్ కగార్ పేరిట నరమేధం


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు

రాయచోటి టౌన్: దండకారణ్యంలో మావోయిస్టుల ఏరివేత కోసం కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో నరమేధాన్ని సృష్టిస్తోందని వామపక్ష నాయకులు అన్నారు. శనివారం రాయచోటి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో మావోయిస్టు పార్టీతో చర్చలు జరపాలని ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్న ఖనిజ సంపదను కొద్దిమంది కార్పొరేట్లకు దోచిపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో అనేక మందిని చంపుతోందని ఆరోపించారు. మావోయిస్టులతో చర్చలు జరిపి శాంతియుత వాతావరణం కల్పించడానికి కేంద్రం చొరవ చూపాలన్నారు. కార్పొరేట్ శక్తుల మెప్పు కోసం ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్‌కు పాల్పడుతోందని పౌర హక్కుల సంఘ జిల్లా కార్యదర్శి ఆర్. రవిశంకర్ ధ్వజమెత్తారు. మావోయిస్టులతోపాటు అమాయక గిరిజనులను కూడా కాల్చి చంపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మన దేశ పౌరులే సామాజిక సమస్యల పరిష్కారం కోసం ఆందోళన బాట పట్టారని, వాటిని కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సింది పోయి వారిపై దాడులకు దిగడం సరికాదని ఆయన హితవు పలికారు. అంబేడ్కర్ సంఘం నాయకులు చంద్రశేఖర్, బంజారా సంఘం నాయకులు శంకర్ నాయక్, ఎరుకుల హక్కుల సంఘం నాయకులు సహదేవుడు, బీసీ నాయకుడు అందెల రమణ, పౌరహక్కుల సంఘ కార్యదర్శి ఎం.రవిశంకర్, బాస్ నాయకుడు తాతయ్య పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన అవసరం


క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారులు

సుండుపల్లె : క్షయ వ్యాధిపై సామాజిక అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని రాయవరం పీహెచ్‌సీలో టీబీ ముక్త అభియాన్‌లో భాగంగా శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి అంటువ్యాధి అని, వ్యాధిగ్రస్తులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వెలువడే తుంపర్ల ద్వారా గాలిలో కలిసి ఇతరులకు వ్యాపిస్తుందని తెలిపారు. ఛాతిలో నొప్పి రావడం, రెండు వారాల పైబడి దగ్గు, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, తగ్గినప్పుడు గళ్లతో పాటు రక్తం పడటం వంటి లక్షణాలు ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్ష చేయించుకోవాలన్నారు. జబ్బు నిర్ధారణ అయితే ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా మందులను పంపిణీ చేస్తామని తెలిపారు. క్షయ వ్యాధి ఊపిరితిత్తులకు కాకుండా శరీర ఇతర భాగాలకు కూడా వచ్చే అవకాశం ఉందని దీనిని ఎక్స్‌రే ద్వారా నిర్ధారణ చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వీరనారాయణ, జయపాల్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు తల్లికి వందనం ఇవ్వాలి


నిరసన తెలుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు

రాజంపేట: మున్సిపాలిటీలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు తల్లికి వందనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు దుర్భర జీవనం గడుపుతున్నారని, వారి పిల్లలకు నాణ్యమైన విద్యను అందించలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమగ్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వారికి కూడా వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. నేతలు పీవీ రమణ, బుజ్జమ్మ, సునీత, ప్రమీల, ప్రసన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మానవత్వానికి ప్రతీక

ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ కోటిరెడ్డి


రాజంపేట టౌన్: రక్తదాన శిబిరంలో పాల్గొన్న కోటిరెడ్డి, కరణం గిరిధర్

రాజంపేట టౌన్: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి రక్తదానం చేసేందుకు ముందుకు రావడం మానవత్వానికి ప్రతీక అని స్టేట్‌బ్యాంక్ రీజనల్ మేనేజర్ కోటిరెడ్డి తెలిపారు. రాజంపేట పట్టణంలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో శనివారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ రాజంపేట రీజియన్ ఆధ్వర్యంలో యూనియన్ నాయకుడు దివంగత వై. తారకనాథ్ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరానికి కోటిరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం ఎంతో గొప్పదని, రక్తదానం ప్రాణదానంతో సమానమని తెలిపారు. మనం చేసే రక్తదానం మరొకరికి పునర్జన్మను ఇస్తుందన్నారు. కాగా తిరుపతికి చెందిన రక్షణ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ కరణం గిరిధర్, నాయకులు ప్రశాంత్‌కుమార్, జగదీష్, షఫి, వివిధ బ్రాంచ్‌లకు చెందిన యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వేణుగోపాల్‌కు పురస్కారం

చిట్వేలి: చిట్వేలికి చెందిన డాక్టర్ దొండ్లవాగు వేణుగోపాల్ రెడ్డి రెడ్ క్రాస్ సంస్థ ద్వారా శనివారం అత్యున్నత పురస్కారం అందుకున్నారు. అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా గుంటూరు జాతీయ విద్యా భవన్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్, రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ వై. డి. రామారావు, సీఈఓ కే. పరిదాల వేణుగోపాల్‌ను సత్కరించి మెడల్ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ 110 సార్లు రక్తదానం చేశానని తెలిపారు. రక్తదానం చేయడాన్ని ప్రోత్సహిస్తున్న కుటుంబ సభ్యులకు, సహకారం అందిస్తున్న మిత్రులకు, ప్రజానీకాయనికి కృతజ్ఞతలు తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

రాయచోటి జగదాంబసెంటర్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రజా చైతన్య సేవా సంఘం డైరెక్టర్ చెన్నారెడ్డి అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ప్రజా చైతన్య సేవా సంఘం ఆధ్వర్యంలో దీప రక్తనిధి సహకారంతో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం చెన్నారెడ్డి మాట్లాడుతూ చాలా మంది రక్తం నష్టపోయి ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రసవ సమయంలో కూడా చాలా మంది రక్తం లేక ఇబ్బందులు పడ్డ సందర్భాలు అనేకం ఉన్నాయని తెలిపారు. ప్రతి వ్యక్తి సామాజిక బాధ్యతగా భావించి రక్తదానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ స్వాతి, ఎం అండ్ ఈ పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రక్త దానం ప్రాణదానం కన్నా మిన్న

గాలివీడు: రక్తదానం ప్రాణ దానం కన్న మిన్న అని గాలివీడు ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో అంతర్జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 108 పైలెట్ రామాంజులు, సింగపూర్ ఆచారి అధ్యక్షతన దీప బ్లడ్ బ్యాంక్, రాయచోటి సహకారంతో గాలివీడు గేటు వద్ద ఉన్న ఆయుష్ చిన్నపిల్లల హాస్పిటల్ ప్రాంగణంలో డాక్టర్ మహేష్ నాయక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దీప బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, ఆయుష్ చిన్న పిల్లల ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ మహేష్ నాయక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


చిట్వేలి: రెడ్‌క్రాస్ సొసైటీ పురస్కారం అందుకుంటున్న డాక్టర్ వేణుగోపాల్


గాలివీడు : రక్తదాతలను అభినందిస్తున్న ఎస్ఐ రామకృష్ణ


రాయచోటి జగదాంబసెంటర్: రక్తదానం చేస్తున్న యువకుడు

పార్టీ బలోపేతానికి కృషి


కేతా చక్రపాణి

పెనగలూరు: పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ పెనగలూరు మండల అధ్యక్షుడు కేతా చక్రపాణి తెలిపారు. పెనగలూరు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా కేతా చక్రపాణి పార్టీ అధిష్టానం నియమించింది. ఆయన మాట్లాడుతూ రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్లకు, రాజంపేట మాజీ ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మ, కొండూరు అజయ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ నాయకుడిపై పోలీసులకు ఫిర్యాదు

ఒంటిమిట్ట: మండలంలో సీసీ రోడ్లను శుక్రవారం రాజంపేట పార్లమెంటరీ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్ రాజు ప్రారంభించారు. అయితే ఈ ప్రారంభోత్సవాల్లో మండల పరిధిలోని గంగ పేరూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారని, సదరు మండలంలోని మంటపంపల్లిలో మరో టీడీపీ వర్గానికి చెందిన నాయకుడు కిరణ్ స్వామి సోషల్ మీడియాలో 'చట్టా పట్టాలు వేసుకొని తిరుగుతున్న టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు' అంటూ పోస్ట్ చేశాడు. దీంతో చమర్తి జగన్ మోహన్ రాజు పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆదేశించడంతో మండల టీడీపీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, కిరణ్‌స్వామిపై శనివారం ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఒంటిమిట్ట సీఐ బాబును వివరణ కోరగా ఫిర్యాదు ఇచ్చిన విషయం వాస్తవమేనని తెలిపారు.

సుప్రీంకోర్టు తీర్పు చంద్రబాబుకు చెంపపెట్టు


మాట్లాడుతున్న పాపినేని విశ్వనాథరెడ్డి

రాజంపేట టౌన్: సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాస రావు అరెస్ట్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు చంద్రబాబుకు చెంపపెట్టు అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథ రెడ్డి అన్నారు. శనివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో డీసీఎంస్ మాజీ చైర్మన్ దండు గోపి, వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు జబ్బిరెడ్డి వెంకటరెడ్డి, ఎస్సీసెల్ జిల్లా నాయకుడు దాసరి పెంచలయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఆవేమీ పాటించకుండా డిబేట్‌లో ఓ విశ్లేషకుడు చేసిన వ్యాఖ్యలను యాంకర్‌కు, ప్రసారం చేసిన ఛానెల్‌కు ఆపాదించడం దారుణమన్నారు. వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు జబ్బిరెడ్డి వెంకటరెడ్డి, దండు గోపి, దాసరి పెంచలయ్య, కళ్యాణ్ రెడ్డి, జుబేద్, శివకుమార్‌రాజు, మాధవరెడ్డి, ఇర్ఫాన్, సునీల్‌రెడ్డి, సోంబత్తిన శ్రీనివాసులు పాల్గొన్నారు.

పరాకాష్టకు రెడ్‌బుక్ పాలన

సిద్దవటం: రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన పరాకాష్టకు చేరిందని సిద్దవటం మండలం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్, టక్కోలు కృష్ణారెడ్డి మండిపడ్డారు. శనివారం ఆయన మాట్లాడుతూ కొమ్మినేని శ్రీనివాసరావు అక్రమ అరెస్టు విషయంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని వ్యాఖ్యానించారు.

పది లీటర్ల సారా స్వాధీనం

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు మండలంలోని వైకోట-ఓబులవారిపల్లి చెన్నరాజుపోడు క్రాస్ వద్ద నాటుసారా తరలిస్తున్న పాలంకోట లక్ష్మమ్మను అరెస్టు చేసి పదిలీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ సీఐ తులసి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది చంద్రశేఖర్, శ్రీనివాసులు, మధుసూదన్ రాజు, రమణారెడ్డి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి సన్నిధిలో సినీ నటి

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ వీరభద్రస్వామిని శనివారం రాత్రి సినీ నటి కరాటీ కల్యాణి దర్శించుకున్నారు. ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి, సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. కల్యాణి స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఘనంగా సన్మానించారు.